# శ్రీకృష్ణుని కృప

భమిడిపాటి సత్యాభిరామయ్యగారు, బి. ఏ., ఎల్. టి.

## ౧. సత్కుటుంబచరిత్ర

బ్రహ్మశ్రీ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు గోపాలపల్లి (యను) కాపురస్థులు, సదాచార సంపన్నులు, బహునిష్ఠాపరులు ఈ యగ్రహారమునం దుండిన యితరవైదికు లందరు స్వగ్రామము వదలి పట్టణములం జేరిరి. కాని శాస్త్రిగా రట్లు చేయ నొల్లక, తండ్రితాతలుండిన యగ్రహారమే కురుక్షేత్రముగ నెంచి, సాలుకు భూకృషిచే లభించు వందరూపాయలే లక్షలుగ భావించి, 'హాలికులైన నేమి గహనాంతరసీమల కందమూలకౌద్దాలికులైన నేమి నిజదారసుతోదరపోషణార్థమై' యను మత మవలంబించి కాలము గడపుచుండిరి. ప్రాతఃకాలమున నిదుర లేచి యేటిలో స్నానముం గావించి సంధ్యాదినిత్యములు సలిపి, పొలముం జూచికొని, మాధ్యాహ్నమున నిల్లు చేరి గృహిణి తన కిడిన యన్నము భుజించి, యపరాహ్ణమున జందెములు వడుకుచు, కుమారునికి వేదము నేర్పి, దినములు గడపుచుండెను. అయాచితముగ ప్రాప్తమగు దానిని గ్రహించునేకాని యాచింపనొల్లడు.

వేదమునందు పారంగతు లగుటయే కాక, గానమునందుసైతము శాస్త్రిగారు నిరుపమాన పాండిత్యము గలవారు. ఇందు భక్తియుక్తము లగు పాటలం బాడుదురు. తదితరముల వర్జింతురు. గానము వీరికుటుంబవిద్య యనంబడు. అనేక సంవత్సరముల క్రిందట వారి పూర్వులలో నొకరు నారాయణ తీర్థులవారి శిష్యులంట. అందుచేత, తరంగములు, అష్టపదులు, అధ్యాత్మరామాయణమునందలి కీర్తనలు, త్యాగరాయకృతులు మున్నగు వానిం బాడుటయందు శాస్త్రిగారు ఖ్యాతి వహించిరి.

శాస్త్రిగారి బాల్యమున గోపాలపల్లిలో నుండి తరువాత పట్టణముల కేగిన కుటుంబములలో నిష్ఠలవారి కుటుంబమును, శాస్త్రిగారిబంధువులగు అనపిండివారి కుటుంబమును పేర్కొనందగినవి. ఈ వంశముల బాలు రిరువురు చిన్నతనమున వీధిబడిలో శాస్త్రిగారి సహపాఠులు — నిష్ఠలకృష్ణశర్మయు, అనపిండి నరసింహసోమయాజియు. వీరి యిరువురియందు బాల్యముననే వేర్వేఱు గుణముల యంకురములు చూపట్టినవి. కృష్ణశర్మ కేవల సత్త్వమూర్తి. బడియందు నియమితపాఠములం జదువుట, గురువుగారి ప్రశ్నలకుం బ్రత్యుత్తర మిడుట, మరలి యింటి కేగుటయే తప్ప, యనవసరవిషయములం దగులు కలుగం జేసికొనడు. ఈతడు మితభాషి, గురువిధేయుడు. కావున. గురువుగారి కితనియందుం బ్రీతి యెక్కువగ నుండెను.

సోమయాజి పూర్వులలో నొకండు యజ్వ. కావున నీతనికి వంశక్రమమున నీ పావననామధేయము కల్గెను; కాని, యీతడు బహుదుర్వర్తనుడు; కుటిలచిత్తుడు; తనకంటె బాగుగ నుండువారిం జూచిన నసూయం జెందువాడు.

ద్విపద. "ఒక్కచోటనె గుమిగూడు నొక్కముగను
రెక్క లొక రంగు గల్గిన పక్కిగుంపు"
అని యాంగ్లేయలోకోక్తి కలదు. మఱియు,

ఆ. "కప్పురము చందనంబును కలయుభంగి
సజ్జనుడు గూడు ననిశము సజ్జనులనె;
భంగు ధత్తూరు చేరెడి భంగి నెపుడు
దుర్జనుం డిలం జేరును దుర్జనులనె."

అని భక్తాగ్రేసరుడు కబీరువక్కె. అట్టె బడియందును క్రీడారంగమునందును, శాస్త్రియు శర్మయు నరనారాయణులవలె నన్యోన్యమైత్రితో మెలగుచుండిరి. సోమయాజియో తనవంటి దుష్టులం జేరి పైయిరువురిని

సతతము పేళనసేయుచు, పెక్కుతెఱంగుల బాధపెట్టుచుండెను.

ఒకనాఁడు వీరుచదువుచుండెడి బడికి చిన్న ఇన్స్పెక్టరుగారు పరీక్షార్థమై విజయముచ్చేసిరి. సోమయాజి చదువులోఁగూడ దొంగయై యితరులచేతఁ బని చేయించుకొనుచుండెను. ఇక్కారణముచేఁ, బ్రశ్నలకుఁ బ్రత్యుత్తరము లొసఁగుటకుఁ దా నసమర్థుఁడని వెఱచి, తనకు పరీక్షయందు సాయముచేయకుండినచోఁ గొట్టుదు నని సోమయాజి శాస్త్రిశర్మలను ముందుదినము బెదరించెను. ఈసంగతి యుపాధ్యాయుం డెఱిఁగి, ఇన్స్పెక్టరుగారు రాకమునుపే తాను ప్రశ్నలువేసి, ప్రత్యుత్తరము లిడినవారిని పైకి పంపి, సోమయాజిప్రభృతులను దరగతి చివరకు దింపెను. ఇట్లు మంచికుఱ్ఱవాండ్రకు దూరమునం జిక్కి పరసాహాయ్యప్రాప్తి లేమింజేసి సోమయాజి మఱియొక వత్సర మాతరగతిలోనే యుండ వలసివచ్చెను.

కావున బాల్యమునుండి శాస్త్రిశర్మలకు మైత్రియు సోమయాజికి వీరిరువురియెడ వైరము నుండెను. కాలక్రమమున నీ రాగద్వేషములు హెచ్చెను.

## ౨. పెండ్లిమాటలు

నలుపదిసంవత్సరము లాయెను. శాస్త్రి యొకఁడే తనగ్రామమునం దుండెను. కాని తదితరులు పట్టణాంతరములకేగిరి. సోమయాజి పోలీసు సబిన్స్పెక్టరై ఇన్స్పెక్టరు కానుండెను. అతనికి పిల్లలనేకులు పుట్టి చనిపోయిన తరువాత "సన్యాసయ్య ధర్మవరమున" కేగి మ్రొక్కిన తరువాత కుమారుఁ డొకఁడుకలిగె. కావున నీతనికి "సన్యాసయ్య" అను నామంబిడిరి. విత్తమెంత ఖర్చుపెట్టినను ఈతనికిఁ జదువంటదాయె. పదునెనిమిదవ సంవత్సరమున మూఁడవఫారములో మూఁడేండ్లుమూలుగుచుండెను. సోమయాజి తన భూముల నమరకము చేయుటకున్ను, శిస్తు వసూలుచేయుటకున్ను స్వగ్రామమునకు తఱుచు వచ్చుచుండెను. వచ్చినప్పుడెల్ల శాస్త్రియింటనే "విస్త" వేయుచుండెను.

శాస్త్రికి యిరువదియేండ్లకుమారుఁడు కృష్ణ శాస్త్రియు, తొమ్మిదిసంవత్సరముల కూఁతురు [illegible] లియు నుండిరి. కుమారుఁడు స్కూలుఫైనలు ప్యాసుచేసి "ట్రెయినింగు" పూర్తిచేసి కాని, యాగ్రామమునందే బోర్డుబడిలో పాతికరూపాయల జీతముపైఁ బ్రధానోపాధ్యాయుఁడుగ నుండెను. తండ్రిగారియొద్ద వేదాధ్యయనమును చేసెను. కావున వైదికకర్మలు జరిపించుటకు సైతము సమర్థుఁడై యుండెను. అదియునుంగాక తండ్రియొద్ద సంగీతము నేర్చుకొని భగవన్నామసంకీర్తనముకూడ చేయుచుండె.

కృష్ణశర్మ చదువులో బహుకుశాగ్రబుద్ధి యగుటంజేసి సర్కారువారి ద్రవ్యసాహాయ్యముచేఁ బట్టపుపరీక్షలలో నుత్తీర్ణుఁడై గొప్ప యుద్యోగముంబొందె. కాని, తొమ్మిదవయేఁట నాగ్రామము విడిచినమొదలు తన స్నేహితుఁడగు శాస్త్రిని కలుసుకొనలేదు.

ఒకనాడు రాత్రి పదిగంటలాయెను. కృష్ణశాస్త్రి నిత్యభజన వేణుగోపాలస్వామియాలయమున నొనర్చి యింటికివచ్చి పరుండి నిదురించుచుండె. ఎవరో తలుపు తట్టిరి. ఎవరనియడుగ, "నేనేరోయి, శాస్త్రీ!" అని బదులువచ్చె. గొంతుకంబట్టి సోమయాజియని యెఱింగి శాస్త్రి యాతనిని లోనికిరమ్మని తలుపు తీసెను. అంతట సోమయాజి, భార్యాపుత్రసమేతుఁడై లోనికి వచ్చి "అబ్బ! ఈదిక్కుమాలిన గ్రామానికి రావాలంటే యమయాతనరా! బాబు! ప్రొద్దున ఆరుగంటలకు నంద స్టేషనులో రైలుదిగితే బండిలేదు. పోలీసుముండా వాణ్ణిగనుక ఎలాగో ఓలాగ బాడిచేయించుకుని ఇక్కడికివచ్చి పడేటప్పటికి, చూశావా రాత్రిపదిన్నర. అబ్బ! కాస్త ప్రసాదంమాట చూతూ!"

పాపము; శాస్త్రిభార్య ఇంటివెలుపలనుండెను. కుమారుఁడు, ప్రెసిడెంటుగారి సెలవైనదని యొక యుపాధ్యాయుల సమావేశమునకుఁ బట్టణమున కేగి యుండె. పాపము! ఆ నడిరేయి రుక్మిణి పొయ్యి రాజవేసి, వచ్చినవారికి, బండివానికి వండి వడ్డించి, వారల సంతృప్తులంజేసె. అంతట వారెల్లరు నిదురించిరి. చిరుచీఁకటి, కోడికూసినవెంటనే, రుక్మిణి నిదురలేచి, గోమయముతో నిల్లువాకిలి యలికి, ముగ్గువెట్టి, చిందెయు, పూలసజ్జయుఁ జేబూని, యేటికేగెను. స్నానమై, [illegible] నిండ నింపి, వేణుగోపాల

స్వామి యాలయమునకేఁగి, స్వామికి నమస్కరించి, తండ్రిగారి పూజార్థము బుట్టలోఁ బూవుల నునిచి, యింటికివచ్చి మడిచీర, కుంకుమ ధరించెను. పసుపుఁ బూసికొనిన మేనఁ గుంకుమ పెట్టినంతనే యాయింటి లక్ష్మియో! "రమా భగవత్యంశభవ" యగు నభినవ రుక్మిణియో! యన నొప్పె. వంటచేసి, తులసిపూజ, గౌరీపూజ సలిపి, వీణ చేలంబట్టి, స్వీయకలరవములు కలియ, మధురగానము సేయుచుండఁ, బ్రత్యక్ష సరస్వతి యనఁనొప్పె.

సోమయాజి కుటుంబసమేతముగా వచ్చుటకుఁ గారణమేమన, తన కుమారుఁడగు సన్యాసయ్యకు రుక్మిణికి వివాహముచేయుట కేర్పాటుకొనుటకే. రుక్మిణి, తనయన్నయొద్ద చదువు నేర్చియుండుటయే కాక, పని పాటలు సైతము నేర్చియుండుటం జూచి, సోమయాజి యానందభరితుఁడై తన భార్య నేకాంతమునఁ జెంతఁజేరి యిట్లని సంభాషణము సేయఁదొడఁగె.

సో:—ఏమిటే! కబురు.

భార్య:—ఏమిటండోయి?

సో:—పిల్ల ఎలాగుంది? నేం చెప్పినదల్లా నిజమేనా?

భా:—మా బాగాచెప్పారు. అలాంటి భార్యరావడం మన దద్దన్నకు కలగాలెగదా! మనవాడి కాపిల్ల నిస్తారని నేనమ్మను.

సో:—ఇవ్వడం పూను నీకెందుకు? ఇవ్వకుంటే ఇప్పి స్తాను. నీమనసుకు నచ్చిందా?

భా:—అటువంటి మణిని చూస్తే ఎవరికి నచ్చదు? ఆపిల్లను పెండ్లాడేటంత భాగ్యము మనవాడి కున్నదా అని సందేహమే కాని ఈ మొద్దు కాపిల్లను కట్టపెడితేమట్టుకు సంసారం ముచ్చటగా వెళ్లుతుందా? అదొకటి ఆలోచించండి.

సో:—ఓసి! పెద్దమ్మా! శకుని పలుకులు పలక్కు! ముడిపడితే ముచ్చట్లవే వొస్తాయి. అక్కుగా వెధవ కబుర్లాడకుమీ!

భా:—[illegible]? పిల్లయేమో ముద్దులమూట. పనిపాటలున్న [illegible]. కాని ఆపిల్ల రూపురేఖలు పనిపాటలు, తెలివితేటలు చూస్తే, ఎక్కడినో గొప్పయింటిలో మంచి చదువరిని పెండ్లాడే యోగ మున్నట్లు కనిపిస్తుందిగాని, మన నిరక్షరకుక్షికి భార్య అయ్యే యోగమున్నట్లు తోచదు. అడిగారు గనక మనసులోవున్నది చెప్పాను. కోపమెందుకు?

సో:—గొప్పయింటిలోనికి పిల్ల నివ్వడమంటే మాటలటే? దానికి తగినట్టే కట్నాలు కానుకలు లాగరా? రెండువేలరూపాయలు చేతపట్టుకుంటే న్యూలు ఫైనలు పంచాంగంపద్దు దొరుకునేమో? ఆపైని చదువు స్థితిగతులుంటే దానికి తగినట్టే ఉంటాయి కట్నాలు కానుకలున్నూ! శాస్త్రిగాడివద్ద, వాణ్ణి అమ్మినా, రెండువేలు కాదు గదా రెండువందలు కూడా లేవు. పెద్దసంబంధాలు వీడి కెలా వస్తాయి?

భా:—అయితే మీరుకూడా కట్నం అడుగుతారా ఏమిటి?

సో:—తప్పకుండాను. వెయిన్నీనూటపదహార్లడక్క మానను.

భా:—అయితే అసలు పోవడానికే దారి.

సో:—ఛీ, వెధవా! వెళ్లిపో అవతలికి. ఒళ్లు మండుతుంది. సామితచెప్పినట్టు శుభంపలకరా పెండ్లి కొడకా అంటే........

భా:—మీ యిష్టం మరి. [నిష్క్రమించును.]

## 3. భీతి

ఈసంభాషణ కొంత గోడ అవతల వంటగదిలో నుండి రుక్మిణివినెను, తండ్రి దరిద్రుండనియు గొప్ప కట్నములు కానుకలు నతఁడివ్వలేఁడనియుఁ దెల్ల మాయెను. తత్కారణముచేత నెవఁడో యభాజనుని కిచ్చునేమోయను భీతి గూడఁ గల్గెను. "ఇవ్వకున్న ఇప్పించెద" నని సోమయాజి పల్కె. ఇచ్చునట్లు చేయుటకుఁ దనతండ్రి నేమి చిక్కులఁబెట్టునో, యీశ్వరా! యని రుక్మిణి భయముఁ గొనెను. సాయంకాలము మరల యేటికి నీళ్లకుఁబోయి, తలదువ్వి జడవేసికొని, పువ్వులు ధరియించి గోపాలస్వామి [illegible] స్వామికి నమస్కరించి, [illegible] నిట్లు [illegible]—

"దేవా! వినువఁట జీవులమాటలు, చనుదఁట చనరాని చోట్లు, శరణార్థుల కోయనువట." నిజమేనా? అయినచో నీభక్తుని నిష్కళంకుని సద్బ్రాహ్మణుని మాతండ్రిని రక్షింపుము. నా కొట్టి పెనిమిటి నిచ్చినను సరే. నీచిత్తమని సహించెదను. కాని నావలన నాతండ్రి ఋణాపీడితుఁడైనను, చిక్కులలోఁ బడినను, సహింపఁజాలను. ఇప్పటి నీపాపముల చెంతనే ప్రాణత్యాగముఁ జేసికొందును. నిక్కము, నిక్కము, ముమ్మాటికి నిక్కము. ఈసోమయాజిని జూడ నాకు యమదర్శనమువలె నున్నది. నామాట కేమి? నాన్నగారి తని వలలలోఁ బడకుండ గాపాడుము జగద్రక్షకా! నీకు దయ రాకున్నచోఁ జెప్పిన పనిచేసి తీరుదును సుమీ!"

అని యెదుటనున్న వానితో మాటలాడునట్లు, కన్నీరు బొటబొట రాలఁగా విలపించెను. కనులు విప్పి స్వామింజూడ విగ్రహము చిరునవ్వు నవ్వినట్టులఁ దోఁచెను. రుక్మిణి హృదయము ధైర్యమునొందె. అంతట నాపిల్ల యింటికి వెడలిపోయి మరల రాత్రి వంటమొదలగు పనులఁ జేయందొడంగె.

తా నేకాంతమునఁ బ్రార్థించెనని రుక్మిణి యనుకొనెను కాని, దుఃఖోద్రేకముచే నుడికినమాటల నొకఁడు వినెను. ఈతఁడా కోవెల పూజారి కుమారుఁడు రంగాచారి. బడిలో నిరతము, ముకుంద శాస్త్రియొద్దఁ గూడి బాల్యమునఁ జదివియుండుటంజేసి రుక్మిణియెడల సోదరభావము వహించి "చెల్లెమ్మా" యని ప్రీతితోఁ బిలచుచుండును. ఈతరుణమున రుక్మిణిపలుకులు విన్నట్లు నటించిన నాచిన్నదాని మనసున కాయాసము కల్గునని తలఁచి మిన్నకుండెనే కాని, తన చేతనైనంత సాయముఁ జేయుటకు దీక్ష వహించెను.

రుక్మిణిని దనకోడలుగాఁ జేయుటకు బహుకాలముక్రిందనే సోమయాజి దూరాలోచనతో నెత్తు వేసి యుండెను. మూఁడుసంవత్సరములు ముందు ముకుందశాస్త్రి వివాహము జరిగెను: తండ్రి మహనీయుఁడుగాన కట్నముల నంగీకరింపలేదు. ఉపరి, పెండ్లిఖర్చుల నిమిత్తము, అయిదువందల రూపాయలప్పుచేసెను. 'దేహి' యని యడిగినచో నీతని మాటనిక్క లభించియుండునుగాని యుచితముగాఁ బహుమానము గ్రహింప నొల్లక, తనకున్న గోష్పాదము భూమిని సోమయాజియొద్ద తనఖాపెట్టి, అయిదువందల రూప్యములకు దస్తావేజు వ్రాసి యిచ్చెను. కావున తన యిచ్ఛానుసారముగ శాస్త్రి వర్తించనిచో నొక్కటకీదస్తావేజు సోమయాజిచేత బ్రహ్మాస్త్రమువలె నుండెను.

ఈ రోజునఁ బగలంతయు శాస్త్రియు సోమయాజియుఁ బొలములం జూచుకొనుచుండిరి. రాత్రి భోజనము సేయు సమయమున సోమయాజి తలపెట్టిన సంబంధము విషయమై యిట్లు చర్చఁజేయఁదొడంగె.

సో:—అయితే, అబ్బి! రుక్మిణి కేదైనా సంబంధము చూశావా? దాదాపు పదకొండేండ్లు నిండిన వను కొంటాను.

శా:—ఆలోచింపవలెగదే. ఎవరి నడిగినా కట్నాలు కావాలంటారు. ఛీ! కాలగతి చూశావా?

సో:—ముకుందానికి పిల్లతో నీవు కట్నం పుచ్చుకుని ఉంటే ఎంత బాగుండును? ఇప్పటి యవసరానికి పనికివచ్చియుండునా?

శా:—శ్రీహరీ! చేసినపాపాలు చాలక యిదికూడానా?

సో:—శింగినాదం! జీలకఱ్ఱ! లోకమంతా తొక్కేతోవ మనంకూడా తొక్కితే పాపమేమి? అదికాక నీ కాడపిల్లయుండుటచే లాభించి యుండునుగదా? రేపు రుక్మిణి పెండ్లిచెయ్యాలగదా, యేంజేస్తావు? మాసన్నగాడి కెవరైనా పిల్లనిస్తామంటే నావట్టుకు నేను వెయ్యిన్నీనూటపదహార్లు కక్కించకమానను.

శా:—పీకపోయినాసరే ఇంత తులసీదళము తీర్థము ధారపోసి, ఒకపసుపుకొమ్ముతో త్రోవను పొయ్యే బ్రహ్మచారి కిస్తానేగాని కట్నాలిచ్చి కన్యాదానఫలం పోగొట్టుకుంటానా!

సో:—ఓరి! నీచాదస్తంగూల! పోనీ, కట్నమే లేదనుకుందాం మాటకు, పెండ్లిజరగవలెనా? పదిమంది రావడం పోవడం; సంతర్పణలు చదివించడాలు, లేనిది కాదుగదా, దాని కేమంటావు? నీభూమి నాతణఖాలోనున్నది. మరి యెవ్వడు దానిమీద దమ్మిడీ నీకివ్వడుగదా. ఏంబెట్టి పెండ్లిచేస్తావు? [తనలో] యిహ కట్నాలక్కావాలంటే అసలు చెడిపోగుంది వ్యవహారం.

శాస్త్రి:—వరుడు లభిస్తే చేసేతోవ కృష్ణుడే చూపెడుతాడు.

సో:—నీ విల్లుకదలక కూర్చుంటే పైబడి వరు డెవడొస్తాడోయి? నాలుగు చోట్లకు వెళ్ళి, వాళ్ళను వీళ్ళను అడిగి సంబంధాలు తెచ్చే శ్రమ నీవు పడజాలవని తెలిసే, నేను మా సన్నిగాడి పేరెత్తాను. గ్రహించావో లేదో!

శాస్త్రి:—అంటే, మీసన్నయ్యకు రుక్మిణిని పుచ్చుకోవలెననా నీతలంపు?

సో:—మరేమి?

శాస్త్రి:—బాబూ! మీరందరు కట్నాలగాళ్ళు. నీకివ్వడానికి వెయ్యినీ నూటపదహార్లునన్న మిత్తి తేవస్తుందా?

సో:—అబ్బే! ఏదో మాటకలాగన్నానుగాని, మనలో మనకు కట్నాలేమిటోయి! అథవా, నీవిచ్చినా నే పుచ్చుకుంటానట్రా? [ఎవరో తలుపు తట్టిన శబ్దము విని రుక్మిణి తలుపు తెఱచును]

రుక్మిణి:—నాన్నా! అన్నయ్యొచ్చాడు.

సోమ:—బాబూ! వచ్చావూ? పట్నంలో నేమి వింతలు? శాస్త్రి! వీడు పెరగ్గా పెరగ్గా అచ్చా! నీలాగ తయారౌతున్నాడోయి!

శా:—(ఏమియుతోచక) ముకుందం! మన రుక్మిణిని సన్నయ్య కిమ్మంటున్నాడ్రా సోమయాజి. ఏమంటావు?

ముకుం:—మామా! మీకు కోపం రాదుగదా? పెద్దలకు నేను చెప్పదగ్గవాణ్ణి కాను గాని, నాలుగు సంబంధాలు చూచిన తర్వాత నిశ్చయించడము శ్రేయస్కరమని నామనవి.

రుక్మిణి:—(తనలో):—భళే! శ్రీకృష్ణుడు నాపాలిట నుండి అన్నయ్య నిలా పలికించాడు.

సో:—(తనలో) ఓహో! ఈ గుంటవెధవ అడ్డుపుల్లలు పెట్టేటట్టు కనిపిస్తున్నాడు. కాస్త బెట్టుమీద వుంటే గాని మర్యాద దక్కదు. వీడు అబ్బలాంటి చాదస్తుడు గాడు. గడుసుబుఱ్ఱ. (బహిరంగముగా) భేషు! బాగా చెప్పావు నాన్నా! వయసులో చిన్నవాడైనా మంచి లోకానుభవం గల పెద్దవాడిలాగ పలికావు. నేను ఆమాటే మీనాన్నతో చెప్పానిప్పుడు. నాలుగూళ్లుతిరిగి నాలుగుసంబంధాలు చూడమనే. నేనుసన్నిగాడిమాట యెందుకెత్తానంటే, నాకు సంబంధాలు లేక కాదు. స్థితిగతులున్నవాణ్ణి గనక పైబడివచ్చి అడుగుతున్నారు; గాని, శాస్త్రి చిరకాలపు స్నేహితుడు. ఎక్కడనో తెలియని సంబంధాలు కలిగించుకోవడాని కంటే, మన రుక్మిణి అయితే వంశమంతా తెలిసినవాళ్లే. రేపు మా యింటికి వచ్చినా కొత్తగా వుండదని ఆలోచించానే కాని వేరులేదు.

ముకుం:—నాకు వట్టుకు సమ్మతంలేదన్నానా? నాలుగు చోట్ల, చూడడం మంచిదన్నానే కాని వేరులేదు.

సో:—మరి నాకేవో నిశ్చయంగా తెలిస్తే గాని, ఇతర సంబంధా లంగీరికరించడమూ మానడమూ!

ముకుం:—అయితే! తమరు నాన్నగారి చిరకాల స్నేహితులు గనక సంవత్సరాదిదాకా నాకు "టైం" మివ్వండి.

సో:—(గొణుగుచు) ఔనులే. ఈలోపుగా యెన్ని సంబంధాలు జారిపోతాయో. అదీకాక మరియొకరైతే కట్నాల దక్క తప్పదు. నేను, మీరిచ్చినా పుచ్చుకునేవాణ్ణి కాను. మీనాన్న యిచ్చే స్థితిలో లేడు. నీవెఱుగవా?

ముకుం:—(మనసునొచ్చి):— ఆయన యివ్వడనండి. సమ్మతంకాదు. స్థితికేమిలెండి, భగవత్కృపయుంటే, ఇచ్చే స్థితి కలుగగూడదా?

సో:—వహవా! శాస్త్రికొడుకులాగే మాట్లాడావోయి!

ముకుం:—[మాటలు వెంమట కిష్టములేక] చెల్లమ్మా! ఏదో కాస్త ముద్దపడేమూ. చెవులు ఘుడిఘలు పడిపోతున్నాయి.

సో:—(తనలో) వీడు ఘట్టిగా అడ్డుతాడు. నిశ్చయం. (బహిరంగముగా) అబ్బీ! శాస్త్రీ! లేతామా? ఏమిటేమో పరధ్యానముగావున్నావు? చేతులు కడుక్కొని వీసరుగుమీద కలుద్దాము రా.

ఆరాత్రి విశ్రమించి మఱునాడుదయమున సోమయాజి కుటుంబ సమేతముగా వెడలిపోయెను.

"అట్నే! శాస్త్రీ! అయితే సంవత్సరాది లోపుగా రుక్మిణి సన్నగాడి కిచ్చేదిలేనిది తేలిస్తేనేగాని, మా చెడ్డచిక్కుపడి పోతానుసుమా" అని బండియెక్కాను, "అలాగే" అని శాస్త్రిపలికాను.

ముకుందశాస్త్రి యూరు చేరినవెంటనే వాడుక చొప్పున వేణుగోపాలస్వామి దర్శనము చేయుచుండ, రంగాచారి రుక్మిణిచేసిన శపథముం గూర్చి యాతనితోఁ జెప్పి "నీవు మెలకువగా నుండకపోతే ఘోరం జరుగుతుంది ముకుందం!" అనెను. ఇంటికి వచ్చినతోడనే సోమయాజి మాటలంబట్టి యాతఁడు తనతండ్రిని నిర్బంధించు చున్నాఁడని గ్రహించి, పైఁజెప్పినరీతి మాటలాడెను. తర్వాత రుక్మిణియు భీతిసూపుచు మాటలాడెను కాని తాఁజేసిన శపథముమాత్రము చెప్పలేదు.

మరునాఁ డీ విషయముంగూర్చి ముకుంద శాస్త్రి తండ్రి నడుగఁగా నాతఁడు "వరాన్వేషణకై నేను దేశాటనము చేయజాలనురా" అనెను.

ముకుం:—నాన్నా! సెలవైతే తిరిగితిరిగి యెన్నితంటాలైనా నేపడుతాను గాని, ఈసన్నగాడి కిచ్చేమాట కలలో తలపెట్టకండి.

శాస్త్రి:—నాకు అంత యిష్టములేదురా. ఎందుకంటే, సోమయాజి మొదటినుండి దొంగవెధవ, నాడి సంతతితో సంబంధము మంచిదికాదు. నిజమేకాని, యేంజేయను? మఱియెవరైనా అయితే కట్నం తెమ్మంటారు. అదీకాక, వీడి కొడుక్కివ్వకుంటే, తనఖాసొమ్ము అసలుఫాయిదాలతో క్రిందపెట్టి మరి మాట్లాడమంటాడు. ఏంగతి? వాడంతటి వాడౌను. దయాదాక్షిణ్యాలులేవు. స్వభావము—పాముపగ.

ముకుం:—అంచేతనే; వాడితో సంబంధం తలపెట్టకండి. నేనైలాగైన చచ్చిచెడి మఱియొక సంబంధం తెస్తాను. మీకెందుకు? కాస్త తంటాలు పడకుంటే తగిన వరుడెలా వస్తాడు?

శాస్త్రి:—కృష్ణుడేదిక్కు.

ముకుం:—నిజమే; అయినను మనుష్యయత్నము చేసి, తరువాత దేవునిపై భారము వేయవలెనే కాని, ఊరక మానుని భగవంతునిపై భార[illegible]

తగదు, తనకు తాను సాయము చేయువానికే దైవము తోడ్పడునని యాంగ్లేయ లోకోక్తి కలదు.

శాస్త్రి:—నీకు ధైర్యముంటేవెళ్ళు. నే నడ్డుచెప్పను.

ముకుం:—రేపు క్రిస్మసు సెలవులలో గోదావరిజిల్లా కెళ్లితే మన ద్రావిడివారు పుట్టలున్నారు. మంచి శ్రోత్రియులు గూడాను. సద్వంశము లోని పిల్ల దొరికితే కట్నాలుకూడా మానివేదురేమో.

శాస్త్రి:—శుభం! వెళ్ళునాన్నా. [తపాలావాఁడు ముకుందశాస్త్రి చేతికొక యుత్తర మిచ్చును] ఏమిట్రా అది, సోమయాజి దస్తూరిలాగ్గనిపిస్తుందే.? ఎక్కడిది పోష్టుముద్ర?

ముకుం:—రైలులో తపాలాబండి ముద్ర. వెళ్ళుచూ వ్రాసినట్టు కనిపిస్తుంది.

శాస్త్రి:—ఏమంటాడ్రా? చదువు.

ముకుం:—[చదువును] బ్రహ్మశ్రీ వేదమూర్తులైన వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి బావగారికి అనపిండి సోమయాజి అనేక నమస్కారములు చేసి వ్రాయంగల విన్నపములు—ఉభయకుశలోపరి.

నిన్న సంబంధంమాటలలో ఒకటి చెప్పుటకు మరిచినాను. ఒకవేళ చి. సౌ. రుక్మిణిని మాసన్నయ్య కిచ్చుటకు నీకిష్టములేనియెడల నావద్ద నీవుంచిన తనఖా తొలూకు అసలుఫాయిదాలు ఈవుత్తర మందిన నెల రోజులలో నాకు చెల్లించవలసియుండును గాన యిందు మూలముగా తెలియపరచడమైనది. ఇంతే నమస్కారములు. చిత్తగించవలెను.

ఇట్లు విధేయుడు
"అ. నరసింహసోమయాజి."

ముకుం:—నే ననుకుంటూనే వున్నా, యిలాటి పిసుగేమో తెస్తాడని.

శాస్త్రి:—అయ్యో! ఏందారిరా! బాబూ! ఇప్పుడైదు వందలరూపాయ లియ్యమని పీకలమీద కూర్చుంటే నేనెక్కడికిపోదురా?

ముకుం:—ఎన్ని బాధలైనాపడి యాతని యాధీనత నుండి తప్పుకుంటేగాని మనకు క్షేమం కాదు. [illegible]

శాస్త్రి:—(మాసిన గడ్డము తడవుచు) కర్తవ్యమే! ఒక్కు తున్నా. దారి కనిపించదు.

ఇంతలో తండ్రిపడెడి మనోవ్యాకులమును గ్రహించిన రుక్మిణి చింతాక్రాంతయై గోపాలస్వామి సన్నిధి కేగి మ్రొక్కె. అంతట మనమున ధైర్యము పొడమె. బిరబిర యింటికి మరల వచ్చె. ఆనాడు రేయి రుక్మిణికి వింతయగు స్వప్నము గానిపించె. వేణుగోపాలస్వామి దివ్యసుందరమూర్తిగాఁ గాన్పించి "గోదావరీస్నాన మొనరించిన నీకు సద్గతికల్గు" నని చెప్పి యదృశ్యుఁడాయెను. మఱునాఁడు తల్లిదండ్రులతోను అన్నతోడను చెప్పెను. తలిదండ్రులు ఖర్చుకువెఱచి రాఁజాల మనిరి కాని, ముకుందశాస్త్రి యానందభరితుఁడయ్యె. తాను గోదావరిజిల్లా కేగ నిశ్చయించుటయు, చెల్లియకుఁ గల్గిన యీస్వప్నమును బహువింతగాఁ దోఁచె. తాఁ బూనిన కార్యము సిద్ధించుటకుఁ గృష్ణుఁడు తోడ్పడు నను ధైర్యము కలిగె. తీర్థయాత్రకు వెళ్ళినట్లు చెల్లెలిం గూడ వెంటఁబెట్టుకొని వెళ్ళినయెడల, పలువురు పిల్లను చూచుట కవకాశము కల్గునని చెప్పఁగాఁ దండ్రి యంగీకరించెను.

క్రిస్టమసు సెలవులలో ముకుందశాస్త్రియు రుక్మిణియు రాజమహేంద్రవర మేగుదురని విని, రంగాచారి యాయూరనుండు తన మిత్రవారి యింట విడిది కేర్పాటుచేసెను.

బయలుదేరుటకు శుభదినము నిశ్చయించిరి. క్రొత్త యూరిలో నగలు దాచుట కష్టమని తన నగలను రుక్మిణి తల్లి కప్పగించెను. వెంటనే వేణుగోపాలస్వామి కోవెల కేగి సగము గొణుగుచు నిట్లు మొఱలిడెను.

"దీనరక్షకా! అలనాఁడు నీవు కుచేలునికి సిరు లియ్యలేదా? అటులనే నేఁడు మానాన్నగారికి దారిద్ర్య బాధ తొలగింపలేవా? వేయేల? నీ కృపయుండినచో మరల నీదర్శనము చేసికొనియెద; లేదా నగలుసైతము అమ్మకు అప్పఁజెప్పి ఆఖరు సెలవు నీయొద్దఁ బొందుట యిదియే. కడసారి దండముఁ గైకొమ్ము."

ముసుపటివలెనే యీమాటలు సైతము రంగాచారి వినెను.

## ౪. భగవదనుగ్రహము

ముకుందశాస్త్రియు రుక్మిణియు రాజమహేంద్రవరముఁ జేరిరి. ప్రతిదినము రుక్మిణి గోదావరిలో స్నానముచేసి మడినీరు తెచ్చి వంటచేయుచుండెను. అను దినము ముకుందశాస్త్రి యాయూరనుండెడి ద్రావిడ కుటుంబము లెవ్వరో కనుఁగొని ఒక్కొక్కరి యింటికి వరాన్వేషణకై వెళ్ళుచుండె. అనేకులు కట్నము లడిగిరి. మఱి కొందరు నోరుతెఱచి యడుగలేక, "ఏమి తొందర? మావాడి కింక రెండుమూఁడు సంవత్సరములవఱకు వివాహము చేయు సంకల్పములేదు. ఈలోపుగా మంచి సంబంధములు చూచుటకున్న 'చైము' ఉండు" అను సూచనగాఁ బల్కిరి. తుదకు మ.రా.రా. శ్రీ శేరి వెంకటేశంపంతులుగారు. బి. ఏ., బి. యల్. హైకోర్టువకీలు, రావుసాహెబు, జిల్లాబోర్డు ప్రెసిడెంటు, (ఇంకను పేర్కొనఁబడని బిరుదము లనేకములు) వీరియింటికి ముకుందశాస్త్రి వెళ్ళియడుగఁగా "అయ్యా! ఈకాలపుకుఱ్ఱవాళ్ళకు మనమేమి చెప్పలేము. వాళ్ళకే తిక్కలిరగాలెగాని, లేకుంటే మనమాట సాగదు." అని బంగరు ముక్కుద్దములజోడు తగిలించుకొని ముకుందశాస్త్రిని మఱి పలుకరించక "కేసులప్రసంగము" "పార్టీల"తో నలుప నారంభించిరి. ప్రాణము విసిగి ముకుందశాస్త్రి 'సెలవు పుచ్చుకుంటా'నని వెడలి వచ్చెను.

ఈవకీలుగారి కుమారుఁడు శేరి కృష్ణమూర్తి తండ్రిగారి మాటలంబట్టి పెద్దలయెడల నవిధేయతతో వర్తించువాఁడేమో యని ముకుందశాస్త్రి ప్రప్రథమము దురభిప్రాయపడెనుగాని, విచారణసేయఁగా సుగుణోత్తముఁడని తెలిసె. ధనకాంక్షగల తండ్రి కట్నము దిట్టముగా లాగి యొక సంబంధ మేర్పాటుచేయ తరి "నాన్నగారూ! కట్నము గ్రహించి వివాహమాడుట నాకు సమ్మతముగాదు. పెద్దలకు నేను మనవిచేయదగినది కాదు కాని, ఈ వివాహవిషయము నా స్వేచ్ఛకు వదలి వేయవలెనని నాప్రార్థన" అని వినయపూర్వకముగాఁ జెప్పెనఁట. అందుచే తండ్రి యాగ్రహము వహించి కుమారుని వివాహవిషయముం గూర్చి యుత్సాహము లేకయుండిరి. చి॥ కృష్ణమూర్తి ఇప్పుడు సర్కారు కళాశాలలో బి. ఏ. పట్టపరీక్షకు చదువుచుండె.

ఈతఁడు గోదావరీ ప్రవాహమందు "స్కౌటు" గా బహుజనోపకారముఁజేసి కీర్తివడసె. "స్కౌటు క్యాంపుతో" ధవళేశ్వరమున కేగియుండెను. "త్వరలో మరలి రానున్నాఁ"డని యందరనిరి. "కష్టము కానింపని యిట్టి సుగుణవంతుఁడు మనరుక్మిణికిలభించిన నెంత బాగు! తండ్రి యడ్డునేమో" అని ముకుందశాస్త్రి యనుకొని చెల్లెలితో నీవృత్తాంతమంతయు చెప్పెను.

రాజమహేంద్రవరమున వీర లిట్లుండ, గోపాలపల్లిలో వీరితలిదండ్రులు, పిల్లలను విడిచి యొన్నడుండకుండుటం జేసి, యేమియు తోఁచకయుండిరి. ఉత్తరములంబట్టి యింకను కార్యసిద్ధి కాలేదనిమాత్రముఁ దెలియవచ్చెను. ఒకనాఁ డుదయమున వీరింగూర్చి సుబ్రహ్మణ్యశాస్త్రిగారి మనసు మిగుల వ్యాకులమొందె. ఏలనో యని యాలోచించుచుండఁగా నాతని భార్య, రుక్మిణి గోదావరిలోఁబడి కొట్టుకొని పోయినట్లు



శ్రీ వేణుగోపాలస్వామి సన్నిధియందు శాస్త్రిగారు తన్మయులై యుండుట


స్వప్నముఁ గన్న వార్త తెలిపె. వెంటనే క్షేమము వ్రాయుమని యుత్తరమువ్రాసి పడవైచి, తంబుర, చిరుతలు చేతంబూని వేణుగోపాలస్వామి సన్నిధికిం జని యేకాగ్రచిత్తుఁడై భజనచేయఁ దొడంగె. అప్పుడు రుక్మిణి యొక ప్రవాహములోఁ బడికొట్టుకొని పోవునట్లు తనకు కనఁబడె. అంతట.—"ఎపుడు కృపకల్గునో" "ఇఁకనైన నామొఱవినరాదా." అను కృతులు పాడి "ఏహి ముదం మమ దేహి" యను తరంగము పాడుతతి, శ్రీకృష్ణుఁడు చేయూఁత యొసఁగి రుక్మిణిని పైకిఁదీసినట్లు కనుపించె. అంతట నానందబాష్పము లొలుక, శాస్త్రి తరంగపరంపరఁ బాడం దొడంగె. చివరకుఁ దనయింటికి వచ్చి "భయములేదు విపత్తునుచ్చి నను కృష్ణుఁడు కాపాడును. నాకభయ మిచ్చె"నని భార్యతోఁ జెప్పి శాస్త్రి యాయమకు దుఃఖోపశమనముఁ జేసె.

ఆ దినమున రాజమహేంద్రవరములో స్నానఘట్టమునొద్ద నున్న జను లున్నట్లుండి గొల్లుమని కేకలు వేసిరి. స్నానము చేయుచున్న పిల్ల యొకతె యకుండ ప్రవాహములోఁ గొట్టుకొని రైలు వంతెన కుండాపోయెను. ఇంతలో జడ్జీబంగాళా చెంతనున్న రాళ్లనుండి యొక యువకుఁడు ప్రవాహములోనికి దుమికెను. జనులు గుంపులుగూడి చూచుచుండిరి. దవ్వున యానము చేయుచున్న నౌకలకు సంజ్ఞలుచేసిరి.

ఇంతలో నాయువ్వాఁడు రుక్మిణిని కేశములం బట్టుకొనెను. గట్టుచేర్ప నెన్నిమారులో యత్నించెను. గాని నీటివిసురుచే నీదలేకపోయెను. ధైర్యము విడువక ప్రవాహములో నీది యొకదబ్బపైకి పిల్లనీడ్చిచూడఁగా, దివ్యసుందర యువతి. ఎవరు? రుక్మిణియే. యువకుఁ డెవరు? స్కౌటు కృష్ణమూర్తి. అప్పుడే ధవళేశ్వరము నుండి యాగట్టువెంట వచ్చుచు నబ్బాలిక పడుటఁ జూచి బనియను చడ్డీ తప్ప నితర వస్త్రముల విసరివైచి ప్రవాహములోఁ బడి పిల్లను పైకిఁ దెచ్చెనుగాని యూపిరి యాఁగిపోయెను. అంతట దాను నేర్చిన విధమున బాహులను సాగించి మడచి పరిక్రియఁ జేయఁగా నెట్టకేలకు శ్వాస పునరపి వచ్చెను. లోఁగొన్న నీరు కక్కించుటకై కాళ్లు పట్టుకొని దిరదిర ద్రిప్పఁగాఁ ద్రావిననీరు వెలుపలికి వచ్చెఁ" గాని, పిల్ల యింకను ప్రజ్ఞ తప్పియుండెను.

మేనం బూసిన పసుపుచేత బంగరుబొమ్మవలె వెలింగెడి యాసుందరాంగనం జూడ కృష్ణమూర్తి మన మునం బ్రీతినొందెను. రుక్మిణి యొక్కసారి కనులు విప్పి చూచి చిరునగవుతో "కృష్ణా! రమ్మంటివి గాన వచ్చితి." అని మరల ప్రజ్ఞలేక పడియుండెను.

కాని వెంకటేశంపంతులుగారు కొమారునితో "ఏడ్చావ్, వెధవ! ఎప్పుడూ ఏటిలోనో నిప్పులోనో మరణం గోరుతుంటావ్" అని యాగ్రహపడెను. కాని జడ్జీగారికి కలెక్టరుగారికిం దనకుమారునిమీఁదం గల్గినదయ తనకుం గూడ లాభించునుగదాయని యుల్లమందు సంతసించెను.



స్కౌటు కృష్ణమూర్తి రుక్మిణిని గోదావరినుండి పైకితీసి యూపిరి తెప్పించ ప్రయత్నము చేయుట

ఇంతలో, భద్రాచలము వైపు సర్క్యూటునుండి వచ్చుచున్న కలెక్టరుగారు దూరదర్శినిం జేఁబూని జరిగినదంతయుఁ జూచి తన "ధూమనౌకను" (S'eam launch) అచ్చటికిం గొనిపోవ నాజ్ఞాపించె. దిబ్బఁజేరి వీరిరువురిని లోనికిఁ దీసికొనెను. ఆయన భార్య రుక్మిణిని పనగదిలోనికిఁ గొనిపోయి తడిబట్టలఁ దీసి పొడిబట్టలిచ్చి వేడిపాలు త్రాగించెను. రుక్మిణి తెలివొంది "ఎక్కడనున్నాను? కృష్ణుఁడేఁడీ?" అనెను. కలెక్టరుగారుకూడా కృష్ణమూర్తికి క్రొత్తబట్ట లిప్పించిరి. తన బంగాళానుండి చూచుచుండిన జడ్జి నిమ్మల కృష్ణశర్మగారు మోటారు పడవబోటు తెప్పించి యొకానొకిగా నచ్చటికే తెంచి వీ రిరువురిని తనగృహమునకుం గొనిపోవ నిచ్చఁ జూప, ప్రాహ్మణు లగుటంజేసి వీరల కచ్చట సౌఖ్యము కల్గునని కలెక్టరుగారు సమ్మతించి స్నానఘట్టమున దింపిరి.

కృష్ణశర్మగారు కృష్ణమూర్తిని తనమోటారులో నింటికిఁ బంపిరి. అబ్బాయితండ్రికి కుఱ్ఱవానిసాహసముం గూర్చి శ్లాఘించియుత్తరము వ్రాసిరి. ఈయుత్తరముచదువు

మఱునాఁడు సబ్కలెక్టరుగారి కచ్చేరిలో పెద్ద కలెక్టరుగారు సభచేసి యాయూరనుండు గొప్పవారిం జేర్చి కృష్ణమూర్తి సాహసముం గొనియాడి జనోపకార సంఘమువారిడు హేమపతకమున కితని సిఫారసుచేసినట్లు చెప్పిరి. చెన్నపట్టణమునుండి తంతివార్త విని వచ్చిన స్కౌటుకమిషనర్ గారు, కృష్ణమూర్తికి "కింగ్స్ స్కౌటు" అను గొప్ప బిరు దిడిరి.

ఇంతలో జడ్జీగారికుఱ్ఱనాఁడు కాపాడిన చిన్నది తన చిరకాలపు స్నేహితుఁడు సుబ్రహ్మణ్యశాస్త్రి కూఁతురని యెఱింగి, ముకుందశాస్త్రిని రుక్మిణిని తనయింటనుండ నియమించెను. శాస్త్రికి సొమ్ముఁబంపి భార్యాసమేతుఁడై రమ్మని వ్రాయ నాతఁ డట్లేవచ్చెను. కలెక్టరుగారి సభలో కృష్ణమూర్తితో నేకాంతముగా సంభాషించి వేయిన్నూటపదహార్లు చదివింప నిచ్చఁజూప నాతఁ డిట్లనియె. "నేను స్కౌటు కావున చేసెడియుపకారమునకు ప్రతిఫలము గ్రహింపఁగూడదను నియమము కలదు. అట్లే ప్రమాణము చేసియున్నాఁడను. కావున యీపిల్ల తల్లితండ్రులు రిక్తదశలో నున్నట్లు

గన్పడుచుండుటంజేసి యీ పిల్లకుఁ జదివించిన నాకిచ్చి నట్లు సంతసించెద" నని సిగ్గుతోఁగూడిన చిరునగవుతోఁ బల్కెను. ఈకుష్ఠవాని ధైర్యము నౌదార్యమును శ్లాఘించుచు జడ్జీగా రుపన్యసించిరి. వకీలు వెంకటేశంపంతులు జడ్జీగారు తన కొమారునిం గూర్చి శ్లాఘించుట యిష్టమైనను వచ్చెడి వేయిన్నినూట పదహార్లు పోఁగొట్టుకొనెనని మోముచిట్లించిరి. అంత జడ్జీగారు సభామధ్యమునకు రుక్మిణిం జేరి వేయిన్నినూటపదహార్లాపిల్లకిచ్చిరి. అంతట జనులెల్లరు "వీరియువురికిం బెండ్లిచేసిన బాగుండు" నని కేకలు వేసిరి. కలెక్టరుగారు లేచి "సభ్యులారా! మీరిప్పుడు కోరిన కోరిక నాభార్యకును నాకును బరమ సమ్మతము, కాని సభాకార్యక్రమముతో సంబంధించిన విషయముకాదు గాన, తరువాత మీర లాలోచింపఁదగిన విషయము. ఇంతటితో సభ చాలింతము" అని "మర్తబు" చేసిరి.

తరువాత జనులు జడ్జిగారి చుట్టు మూగి, "మా యభీష్ట మేమి నెరవేర్చెదరా?" అని యడుగ, జడ్జీగారు, కుష్ఠవాని సమ్మతి నాతని సిగ్గు చిరునగవుం బట్టి గ్రహించిరి కావున, వకీలుపైపు తిరిగి "ఏమండీ, వేంకటేశం పంతులుగారు! తమరికి సమ్మతమా? మీరంప రేక శాఖవారే కదా?" అనిరి. వేంకటేశం పంతులుగారికి కట్నము లేమింజేసి తృప్తిలేకున్నను, జడ్జిగారి యనుగ్రహము సంపాదించుట మంచిదని "తమ సలవుకభ్యంతరమేమి; శుభం, కానివ్వండి" అనిరి. తర్వాత జడ్జీగారు శాస్త్రివైపు మళ్లి "ఏంశాస్త్రీ! నీవేమంటావు!" అని యడుగ, శాస్త్రి యభినవ కుచేలునివలె "నీమాట కెన్నడైన నే నెదురాడెడ ముండునా? అదియుంగాక బహుజనసమ్మతము భగవత్సమ్మతము" అనిరి.

జడ్జీగారే శాస్త్రిని ఋణబాధనుండి తొలఁగించి వివాహము జరిపించిరి. వివాహసమయముననే జనోపకారసంఘమువారిచ్చిన హేమపతకము వచ్చెను. తరువాత కృష్ణమూర్తి పట్టపరీక్షయందు తీర్ణుఁడై, సర్కారువారి యనుగ్రహముచే "డిప్యూటి తహశిలుదారై" త్వరలో డిప్యూటీకలెక్టరుగా గోదావరిపై యానము చేయవలసివచ్చెను. మునుపటి దిబ్బప్రక్కనుండి వెళ్లుచుండఁగా, నాతఁడు రుక్మిణింబిలిచి యాదిబ్బచూపి, "నిన్ను నీటనుండి యీదిబ్బ మీఁదికి నే నీడ్చినవెంటనే "కృష్ణా! రక్షింటివి గాన వచ్చితి" నంటివి!" అని యడిగెను.

రుక్మిణి:—గోదావరి స్నానము చేయుచుని నాతోఁ గలలోఁ గృష్ణుఁడు చెప్పినప్పుడు మీవలెనే కన్పడె. కావున మిమ్ముంజూడఁగాఁ గ్రొత్తఁగాఁ దోఁచలేదు.

కృష్ణ:—ఏమి యూహింత!

రుక్మిణి:—వింతయేమి. మీరు కృష్ణుఁడు గారా? ఇదంతయుఁ గృష్ణునికృప.

---

# అభావప్రాదుర్భావము

జంధ్యాల శివన్నశాస్త్రి గారు

నాఁడు ప్రేలాపమ్ముగను గర్వపడనొకో, అదియ నీతోడ మాటాడఁజేసె
నా యసంగత జీవనమున కుప్పొంగనో, యదియకా నీపొందు నందఁజేసె
నాయంధతకు నుబ్బనా యదేకద విశ్వచక్షు వొసఁగి రహస్యంబు చూపె
నా యకించనత కానందించనా యదేకద నాకుఁ బెన్నిధిఁ గలుగఁజేసె

గీ. నేను నాదను శోధనమునపై నేల హర్షమూననొకొ నేర్చినా కదిగాన మొకటి
దాని నేనీయెడ వశంగత మ్మొనర్చుకొంటి సద్దానివాంఛ రయకొండె నాదు
జీవనాకాంక్షయై మున్ను చెలఁగుచుండె.